'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కేసులతో విపక్షాల వేట

భారతదేశం అసాధారణమైన పరిస్థితుల్లో పార్లమెంటు ఎన్నికలకు పోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాధినేతలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు జైలులో మగ్గుతున్న, అరెస్టు కాబోతున్న భీతావహ పరిస్థితుల్లో నూతన కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజాస్వామిక కసరత్తు జరుగుతున్నది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టుకు ముందు రాజీనామా చేస్తే, తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు చేసినా రాజీనామా చేయలేదు. జైలు నుంచే సర్కారును నడుపుతానని తెగేసి చెప్పారు. ఆ మేరకు తన ప్రభుత్వంలోని ఓ మంత్రికి ఢిల్లీ నీటి సరఫరా మెరుగుదలపై ఆదేశాలు పంపారు కూడా. ఇదంతా గమనిస్తే ఎవరికైనా కొంత గందరగోళం కలగడం సహజమే. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దాడులు, అరెస్టులతో విపక్షాలను వెంటాడుతున్న సంగతి తెలిసిందే. అందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీతో పాటుగా ఐటీని బాహాటంగా ఉపయోగించుకుంటున్నది. ఇదంతా అవినీతిని అంతం చేసేందుకని కేంద్రం అంటున్నది. కానీ, కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాం అనేది విపక్షాలను వేధించేందుకు కేంద్రం చేతిలో ఆయుధంగా మారిందనే విమర్శలు బలంగా వినవస్తున్నాయి.

రెండేండ్లయినా ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసు ఎటూ తేలలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు సేకరించిన బలమైన సాక్ష్యాలు అంటూ ఏవీ లేవు. కేవలం అరెస్టయినవారి వాంగ్మూలాల ఆధారంగా కేసు ముందుకు సాగుతున్నది. దీనిపై గతంలోనే కోర్టులు నిలదీశాయి. అయినా ఎడతెరిపి లేకుండా దాడులు, అరెస్టులు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు పెట్టే కేసులపై విశ్వసనీయత చాలా తగ్గిపోయింది. ఈ తరహా కేసుల్లో నేర నిరూపణ జరిగి శిక్షలు పడటం చాలా చాలా తక్కువ. రాజకీయ నాయకులకు సంబంధించి సీబీఐ, ఈడీ దర్యాప్తు చేసిన కేసుల్లో 95 శాతం విపక్షాల పైనే కావడం గమనార్హం. ఇకపోతే మొత్తంగా ఈడీ కేసుల్లో ముగింపునకు చేరినవి 0.5 శాతానికి లోపే. ఈ ధోరణికి టూజీ స్కామ్ అతిపెద్ద ఉదాహరణ. డీఎంకే నేతలు కనిమొళి, రాజా తదితరులపై టూజీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఏడేండ్ల కాలయాపన తర్వాత కూడా ఈ కేసులో ఒక్కరికీ శిక్ష పడలేదు. మొత్తం నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేశారు. కేవలం దర్యాప్తు సందర్భంగా సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా చార్జిషీటు రూపొందించారు. తర్వాత సాక్షులు కోర్టు ముందు అవేవీ ఒప్పుకోలేదు. సీబీఐ స్పెషల్ జడ్జి ఓపీ సైనీ ఈ కేసు తీర్పులో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం గుర్తు చేసుకోవాల్సిన అవసరమున్నది. నిందితులు చేశారంటున్న నేరాలకు సంబంధించిన ఆధారాలేవీ కేసులో చూపలేదు. అధికారిక రికార్డుల్లోని అంశాలను తప్పుగా చదవడం, అరకొరగా చదవడం, కొన్నిటిని మింగేయడం లేదా సందర్భ శుద్ధి లేకుండా చేర్చడం ద్వారా చార్జిషీటు తయారుచేశారు అని ఆయన పేర్కొనడం గమనార్హం. ఢిల్లీ లిక్కర్ కేసులోనూ సీబీఐ జడ్జి నాగ్‌పాల్, సుప్రీంకోర్టు ధర్మాసనం సాక్ష్యాధారాల కోసం దర్యాప్తు సంస్థలను నిలదీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ తరహా కేసుల విశ్వసనీయత, వాటివెనుక గల ఉద్దేశాలు సందేహాస్పదం కావడం సహజమే. అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల సాధనకు కేంద్ర సంస్థలు పనిముట్లుగా మారాయనే అభిప్రాయం దేశంలో అంతకంతకూ బలపడుతున్నది. ముందుగా ఒక ఆరోపణ చేస్తారు, దాడులు జరుగుతాయి. ఆ తర్వాత ఓ నిందితుడు అప్రూవర్‌గానో, మరో రకంగానో వాంగ్మూలం ఇస్తాడు. దాని ఆధారంగా మరికొందరిని నిందితులుగా మారుస్తారు. అనంతరం వారు ఇక దోషులే అన్నట్టుగా సోషల్ మీడియాలో ఊదరగొడతారు. ఈలోగా అరెస్టయిన నాయకులకు ఎంతో నష్టం జరుగుతుంది. అది జైల్లో గడిపిన కాలం కావచ్చు. లేదా రాజకీయంగా వాటిల్లిన నష్టం కావచ్చు, వ్యక్తిగతంగా అనుభవించిన మనోవేదన కావచ్చు.. జరిగిన అన్యాయానికి ఎవరు జవాబు చెప్తారు? ఈ నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? ఇవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు. ఈ క్రమం గురించే ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యం అనేది కొన్ని నియమాలకు కట్టుబడి ఆడే ఆట వంటిది. ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే దానిని తొండాట అంటారు. ఈ తొండాటలో బీజేపీ ఆరితేరినట్టు కనిపిస్తున్నది. రాష్ర్టాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలను చీల్చడం, కూల్చడం లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతున్నది. అందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగిస్తున్నది. ఎమ్మెల్యేల కొనుగోలు, చీలికవర్గం సాయంతో ప్రభుత్వం ఏర్పాటు, దారికి రానివారిపైకి కేంద్ర సంస్థలను ఉసిగొల్పడం, దాడులు, అరెస్టులతో వేధించడం, తనవైపు మళ్లినవారిపై దాడులు, కేసులు నిలిపివేయడం వంటి చర్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్ రాష్ర్టాల్లో ప్రభుత్వాల చరిత్ర గమనిస్తే మనకు బీజేపీ వ్యవహారశైలి స్పష్టంగా బోధపడుతుంది. ఈ తతంగమంతా ప్రభుత్వం చెప్తున్నట్టు కేవలం అవినీతిని అంతం చేసేందుకే అనేది నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో, అంత నిజం!

2019 పుష్య మాసం... మాన్యులంతా కలిసి మా ఊరొస్తున్నరు. ఎట్టైనా వాళ్లకో పూట బువ్వ పెట్టాలనుకున్నం. 'ఏం పెట్టాలే?' అని మా ఊరి పెద్దలతో సమాలోచన చేస్తున్న. 'నాటుకోడి కూర' అన్నడు మా సోదరుడు వీరమల్లు. 'కేసీఆర్ గొర్లు ఎదిగినయ్.. రెండు పొట్టేళ్లు కొట్టి పెడదాం' పేర్ల పాపన్న, మెంతబోయిన సింహాద్రి (యాదవులు) సలహా. మంచి ఆలోచనే. పైగా మా ప్రాంత బీడు భూముల్లో పొట్లగడ్డి, మదనకర్ర దొరుకుతుంది. ఆ గడ్డి తిని కండ పట్టిన పోతు మాంసం రుచికరంగా ఉంటుంది. ఇదే ఖాయం చేద్దామనుకున్నం. ఇంతలో బండి అంతయ్య (ముదిరాజులు) కాక వచ్చిండు. 'నేను మెప్పిస్త. నా మీద గురిపెట్టురి'. అన్నడు. కాక..! తెల్లారితే కార్యం. పెద్దోళ్ల ముచ్చట. ఎటమటమైతే మాటొస్తది ఆతృత.. ఆందోళన కలబోతతో హెచ్చరించిన.

'నాకొదిలిపెట్టు బిడ్డా.. నువ్వు మిగతా పన్లు జూస్కోపో' భరోసాగా చెప్పిండు. అంతయ్య కాకకు నాకంటే మా అన్నతోనే బిగు సోపతి. మాట మనిషి. చెరువు అంచుకే ఊరు. అదే రాత్రి అంతయ్య కాక ఇంకొంత మంది పోయి చెరువు తూము మలిపి బురద నీళ్లు పునుకితే..! జల్లి బుట్టెడు నార జెల్లలు, కొంసెలు ఎల్లినయి. తీసుకొచ్చి పులుసు పెడితే..! అతిథులంతా కడుపు నిండ తిన్నరు. నారజెల్ల పేరు వింటేనే తెలంగాణ పల్లె లొట్ట లేస్తది. ఆంధ్రోళ్ల బొమ్మిడాయిని మించిన రుచి. నా బాల్యంలో చూసిన. మళ్లీ ఇప్పుడు చూస్తున్న. సరిగ్గా 20 గ్రాములు కూడా తూగని చెరువు చేప. 40 ఏండ్ల కిందనే కనుమరుగైంది.

బాపూ.. దూపైతందే!

నీళ్ల మీదనే పల్లె బతుకుందని పోరు తెలంగాణ నడిపిన దళపతే.. వేరు తెలంగాణకు అధిపతి అయ్యిండు. అటెన్క చెరువుల పునరుద్ధరణ ఉద్యమం చేసిండు. 46 వేల చెరువుల పూడిక తీసిండు. కూలిపోయిన మత్తడి గోడ మళ్లీ నిలబెట్టిండు. గోదావరి మీద కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. కృష్ణ మీది నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తిలను ఎత్తిపట్టి చెరువుతో సంధానించిండు. చెరువు చుట్టూ జల పెరిగింది. జలం ఇచ్చిన బలంతో పచ్చదనం విచ్చుకున్నది. పచ్చబడ్డ చెట్టు మీద పిట్ట వాలింది. మట్టి మురిసి వానపేగు కదిలింది. ఎండిన తెలంగాణ నిండుకుండగా తొణికిసలాడింది. జీవ వైవిధ్యం ఊపిరి పోసుకున్నది. ఇదో అసాధ్య కృత్యం. కోట్లు ఖర్చుచేసినా సాధ్యం కాని కార్యం. పదేండ్లలో సుసాధ్యమైంది. తెలంగాణ జీవ వైవిధ్య మాగాణిగా నిలబడ్డది. అట్లా మళ్లీ ఊపిరి పోసుకున్నయే నార జెల్లలు. ఒక్క నారజెల్ల జాతి మాత్రమే కాదు..! ఎన్కటికి పల్లె చెరువుల్లో కలెదిరిగిన కొడిపెలు, సందమామలు, ఉస్కెదొంతులు, నల్ల పంకిర్లు, సన్న రొయ్యలు, ఎర్ర రొయ్యలు తదితర పది పదిహేను తీర్ల మీన జాతులు తిరిగొచ్చినయి. నీళ్లు లేవని చెరువు మీద అలిగిపోయిన బుడుబుంగలు, ఎరగారు కొంగలు, ఎడ్డికొంగలు, గుడ్డి కొంగలు, ఆలేటి కొంగలు, కారు కొంగలు, సైబీరియా కొంగ జాతులు మళ్లొచ్చి ఒంటికాలు జపం చేస్తున్నయి.

రాబందులు వాలిన నేల మీద తీరొక్క జీవ జాతులు రెక్కలు విప్పటం అనేది ఓ అద్భుతం. దశబంద చెరువులను నింపిన తర్వాత అటువంటి అద్భుత జీవవైవిధ్య దృశ్యాలను చూశాను. కందనూలు.. ఇందూరు.. మెతుకుసీమ.. ఓరుగల్లు.. కరినగరి.. ఖమ్మం, నల్లగొండ జిల్లాల పల్లెల్లో తిరిగి మత్తడి దుంకిన చెరువులను ఎత్తుకున్న. పారే నీళ్లు.. పచ్చటి పొలాలను ముద్దాడిన. పల్లెల్లో పునర్జీవం పోసుకున్న జీవజాలాన్ని కండ్లారా చూసిన. ఆ సదృశ్యాలను ఎత్తిపట్టుకొని పిట్ట వాలిన చెట్టు పుస్తకం రాశాను. అగో.. ఆ పుస్తకావిష్కరణ వేదికే కర్విరాల కొత్తగూడెం. అప్పటి మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, అప్పటి ఎమ్మెల్యేలు దివంగత నేత సోలిపేట రామలింగారెడ్డి, గాదరి కిశోర్‌తోపాటు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, అల్లం నారాయణ వచ్చారు.. పుస్తకం ఆవిష్కరించారు.

ఉమ్మడి ఏలుబడిలో వరి పరిశోధనలన్నీ గుంటూరు, ఉభయ గోదావరి కేంద్రం చుట్టే సుదరాయించబడ్డయి. తెలంగాణ భౌగోళిక, జీవన వైవిధ్యం సంపూర్ణంగా సురాలించబడ్డది. సముద్ర నిసర్గను తట్టుకొనే వరి వంగడాలే సృష్టించబడ్డయి. ఏపీలోని 13 జిల్లాలలో (ఇప్పుడు 26 జిల్లాలు) మూడు జిల్లాలు మినహా.. మిగిలిన 10 జిల్లాలు సముద్రం ఒడ్డునే ఉన్నయి. సముద్ర వాతావరణంలో 78 శాతం నత్రజని, 21 శాతం ఆక్సిజన్, 0.9 శాతం ఆర్గాన్లు, 90.6 శాతం తేమ ఉంటుంది. ఆ గాలికి తగ్గట్టే వరి విత్తనాలు సృష్టించి.. బలవంతంగా మనకూ అంటగట్టేటోళ్లు. మన గాలిలో తేమ వేరు. ఇక్కడి ప్రకృతి వేరు. భూమి మూలక స్వభావం వేరు. కానీ మనకు తగ్గ విత్తనమేది? గతి లేక మన రైతులు అవే విత్తనాలు సాగు చేసేటోళ్లు. వరి మొలకల కంటే ముందే చీడ పీడలు పుట్టేది. వుల్లికోడు, అగ్గితెగులు, పేనుబంక, దోమకాటు చీడ వ్యాధులు అక్కడినుంచి దాపురించినవే. మొలక అలికింది మొదలు పంట చేతికందే వరకు దిగుబడి దినదిన గండమే ఉండేది.

> చెరువుల పునరుద్ధరణ జరిగి తెలంగాణ జరంత నిమ్మలపడ్డ తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ మన గాలికి తగ్గట్టుగా వరి వంగడాల సృష్టిపై దృష్టి పెట్టిండు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలను పిలిచిండు. మన విత్తనం మనకు ఉండాలన్నడు. విస్తృత పరిశోధనలు జరగాలన్నడు. జీవవైవిధ్య వంగడాలు కావాల్సిందే అని ఆదేశించిండు. శాస్త్రవేత్తలు పూనుకుంటే బతుకమ్మ వంగడాలకు బీజం పడ్డది.. అవి మొలకెత్తితే..! భూమికే బరువయ్యేంత ధాన్యం పండింది. తర్వాత తెలంగాణ సోనా (ఆర్‌ఎన్‌ఆర్-15048) జీవం పోసుకున్నది. అది ఎదిగి దేశ ధాన్యం మార్కెట్‌నే షేక్ చేసింది. క్వింటా తెలంగాణ సోనా ధర రూ.3,545 పలికింది.

ఉమ్మడి రాష్ట్రంలో తిప్పితిప్పి కొడితే గోదావరి నుంచి తెలంగాణకు 90 టీఎంసీలు కూడా రాలేదు. కృష్ణా నది నుంచి 25 టీఎంసీలకు మించలేదు. అంతా కలిపి 110-115 టీఎంసీల నీళ్ల కోసం నిత్య కొట్లాటలు.. గొడవలు. చంద్రబాబునాయుడైతే నీళ్ల మీద రాజకీయం చేసే బతికిండు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా.. ఒక్క గోదావరి నుంచే గరిష్ఠంగా 400 టీఎంసీలకు పైగా వినియోగించుకొనే స్థాయికి చేరుకొన్నది. కృష్ణా నది మీది నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి పెండింగ్ ప్రాజెక్టులు రన్నింగ్ ప్రాజెక్టులుగా రూపం మారి 6.5 లక్షల ఎకరాలకు సాగునీరందింది. అంతా కలిపి 2023 నాటికి 1.4 కోట్ల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వచ్చింది.

అటు జల విప్లవం ఇటు హరిత విప్లవంతో తెలంగాణ వ్యవసాయ రూపురేఖలే మారిపోయినయి. 'మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్' నివేదిక ప్రకారం.. తెలంగాణలో 2012-13కు ముందు దిగుబడి వరి ధాన్యం విలువ రూ.8,291 కోట్లు కాగా.. 2021-2022కు రూ.22,544 కోట్లకు పెరిగింది. పదేండ్ల కాలంలో దిగుబడి విలువ 150 శాతం మేర పెరిగింది. 2022 రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి మూడు కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇంత ధాన్యం తాము కొనలేమని ఓ దశలో కేంద్ర ప్రభుత్వమే చేతులెత్తేసింది.

అటువంటి తెలంగాణకు ఇంతలోనే ఎంత వైమత్యం? కాలం అవరోహణమైంది. కాలచక్రం తిరోగమనంలో గిర్రున తిరిగి ఎన్కటి పొద్దుళ్ల ఆగింది. చెరువుల్లకు నీళ్లొస్తయని ఎదురుచూస్తుంటే.. కళ్లల్లకు నీళ్లొస్తున్నయి. కాళేశ్వరం నీళ్లు పోయినయి. పంటకాల్వ ఆగింది. యాళ్ల తప్పిన కరెంటయింది. బిక్కి బోరు కింది కాపురమొచ్చింది. ఎటు జూసినా ఎండుగాలమే.. రైతు ఎవుసం గాసానికే ఎల్లేటట్టు లేదు. కోటి ఎకరాల మాగాణం తడి తప్పుతున్నది.. ముక్కోటి గొంతులు బాపూ.. దూప అంటున్నయి.



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

తెలంగాణ తీర్పు వెనుక ఏమున్నది?

'గెలుపుకు అనేకమంది భర్తలు.. ఓటమి అనాథ' అనేది ఒక నానుడి. కాలమెప్పుడూ గెలిచినవాడి ఘనతలు కీర్తించడంలోనే కాలక్షేపం చేస్తుంటుంది. అయితే, ఓటమి అన్నిసార్లు పొరపాట్ల ప్రతిఫలం కాదు. పర్సెప్షన్ పాలిటిక్స్‌లో ఫలితాలకన్నా సామూహిక జనాభిప్రాయం గెలుపోటముల్లో కీలక పాత్ర పోషిస్తుంది. తెలంగాణలో సరిగ్గా అదే జరిగింది. తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, తొలి ప్రభుత్వంగా కొలువుదీరి ఈ ప్రాంతాన్ని ఎన్నోరకాలుగా అభివృద్ధి చేశారు. అయినా, మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమిపాలైంది. ఎందుకు? దీనివెనుక కారణాలేమిటి? ప్రసిద్ధ వార పత్రిక 'ఎకనామిక్ పొలిటికల్ వీక్లీ (ఈపీడబ్ల్యూ)' దీనిపై మార్చి 16 సంచికలో ఆసక్తికరమైన విశ్లేషణ చేసింది. ఈపీడబ్ల్యూ సౌజన్యంతో ఆ విశ్లేషణ అనువాదం మీ కోసం..

లక్ష్మణ్‌రావు సంకినేని
హరినాథ్ సిలివేరు



COMMENTARY

Decrypting the Telangana Assembly Mandate, 2023

LAXMAN RAO SANKINENI, HARINATH SILVERU

A distinctive feature of the 2023 polls in Telangana was that the issue of development virtually became a non-issue. The pre-poll surveys also captured the conflicting sentiments among the electorate—a deep sense of anti-incumbency despite the visible signs of "development." The opposition succeeded in escalating the anti-incumbency through a narrative focusing on the failings of the incumbent regime rather than on development. The poll verdict also shows that electoral gains from welfare transfers would diminish in the long run if development

The outcome of the 2023 Telangana assembly elections has thrown up certain unique trends in India's democratic landscape. Typically, state elections revolve around dominant themes such as development and performance of the incumbent government and, of late, the range of welfare schemes implemented by the ruling regime. By stark contrast, a distinctive feature of the 2023 Telangana assembly polls was that the issue of development virtually became a non-issue, nor was it the main plank of the electoral campaign of the opposition parties. During the run-up to the polls, it was widely perceived that the ruling BRS (Bharat Rashtra Samithi) party (earlier known as the TRS—[Telangana Rashtra Samithi]) was confronted with a groundswell of anti-incumbency. Drawing on empirical evidence, the core factors that shaped the popular disaffection with

2023లో ముగిసిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల విశిష్ఠత ఏమంటే.. అభివృద్ధి అంశం పట్టించుకోకపోవడం. ఎన్నికలకు ముందు చేసిన వివిధ సర్వేల్లో ఓటర్లు భిన్నాభిప్రాయాలను వెల్లడించారు. అభివృద్ధి చేసినట్టు స్పష్టమైన సంకేతాలున్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత కూడా కనిపించింది. అభివృద్ధి అనే అంశాన్ని పక్కదోవ పట్టించి అక్కడక్కడ ఉన్న చిన్న లోపాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడంలో ప్రతిపక్షం విజయవంతమైంది. ప్రజల ప్రాధాన్యాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు లేకుంటే దీర్ఘకాలంలో సంక్షేమం ద్వారా ఎన్నికల్లో వచ్చే లబ్ధి తగ్గిపోతుందని ఈ తీర్పు ద్వారా తెలుస్తున్నది.

ఇటీవల ముగిసిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో కొన్ని ప్రత్యేక ధోరణులను ఆవిష్కరించాయి. సాధారణంగా రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికలు.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలు, పాలకుల పనితీరు తదితర అంశాల చుట్టూ తిరుగుతాయి. కానీ, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక లక్షణం ఏమంటే వాస్తవంగా అభివృద్ధి అంశం ప్రధాన విషయంగా మారలేదు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది. నాటి ప్రభుత్వ వ్యతిరేకతకు, ప్రజల్లో అసంతృప్తికి గల కొన్ని అంశాలను ఈ వ్యాసంలో విశ్లేషిద్దాం. 2018లో 'లోక్‌నీతి-సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ రెండుసార్లు నిర్వహించిన ముందస్తు ఎన్నికల సర్వేలు, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఐదు నెలల వ్యవధిలో రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో ఓటర్లతో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లోని డివిజన్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ ఇన్‌క్లూజన్‌కు చెందిన సీనియర్ పరిశోధకుల బృందం నిర్వహించిన అభిప్రాయ సేకరణ ఆధారంగా ఈ అంశాలు విశ్లేషిస్తున్నాం.

ఉమ్మడి ఏపీలోని తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక హోదా కోసం జరిగిన రెండో దశ ఉద్యమం ఫలితంగా 2014లో తెలంగాణ ఆవిర్భవించింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సాధనలో టీఆర్‌ఎస్ పోషించిన పాత్ర కారణంగా తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అధికారం టీఆర్‌ఎస్‌కే దక్కింది. ఆర్థికాంశాలను ఒకసారి పరిశీలిస్తే... 2014-15లో రూ.5,05,849 కోట్లుగా ఉన్న తెలంగాణ జీఎస్డీపీ 2021-22 నాటికి రూ.11,48,115 కోట్లకు చేరుకున్నది. తెలంగాణ వృద్ధి రేటు దేశ జీడీపీని దాటిపోయింది. తత్ఫలితంగా 2014-15లో దేశ జీడీపీలో 4.1 శాతంగా ఉన్న తెలంగాణ వాటా 2022-23 నాటికి 4.8 శాతానికి చేరుకున్నది. కేంద్ర ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ 2022-23 లెక్కల ప్రకారం.. రూ.3,12,398 తలసరి ఆదాయంతో 2022-23 నాటికి తెలంగాణ దేశంలో మూడో స్థానంలో ఉన్నది. తెలంగాణ ఏర్పడినప్పుడు 2014-15లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,24,104 మాత్రమే. ప్రస్తుతం తెలంగాణలోని అన్ని జిల్లాల తలసరి ఆదాయం జాతీయ సగటు రూ.96,522 కంటే ఎక్కువే కావడం విశేషం.

2023లో నీతి ఆయోగ్ విడుదల చేసిన బహుముఖ పేదరిక సూచీ ప్రకారం తెలంగాణలో పేదరికం గణనీయంగా తగ్గింది. ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు ఆధారంగా బహుముఖ పేదరికం లెక్కిస్తారు. తెలంగాణలో 2015-16లో 13.18 శాతంగా ఉన్న పేదరికం 2019-20 నాటికి 5.88 శాతానికి తగ్గిపోయింది. 27,61,201 మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఇక్కడ గమనించవలసిందేమంటే.. పట్టణ పేదరికం కంటే గ్రామీణ పేదరికమే ఎక్కువ శాతం తగ్గడం. 19.51 శాతంగా ఉన్న గ్రామీణ పేదరికం 7.51 శాతానికి తగ్గింది. అదే సమయంలో రెండు జిల్లాలు మినహాయించి మిగతా అన్ని జిల్లాల్లో పేదరిక నిష్పత్తులు జాతీయ సగటు (14.96 శాతం) కంటే తక్కువగా ఉన్నాయి.

> ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ నదీ జలాల్లో న్యాయమైన వాటా దక్కాలన్న చిరకాల డిమాండ్‌ను పరిష్కరించేందుకు బీఆర్‌ఎస్ సర్కార్ నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం సుమారుగా రూ.1,60,979 కోట్లను సాగునీటి రంగంపై పెట్టుబడి పెట్టింది. ఇది రాష్ట్రంలో స్థూల నీటిపారుదల విస్తీర్ణం గణనీయంగా పెరగడానికి గణనీయమైన దోహదం చేసింది. 2014-15లో 62.48 లక్షల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం 2021-22 నాటికి 1.35 కోట్ల ఎకరాలకు చేరుకున్నది. తత్ఫలితంగా 2014-15లో 34,97,571 ఎకరాలుగా ఉన్న వరి సాగు విస్తీర్ణం 2021-22 నాటికి 97,97,795 ఎకరాలకు చేరుకున్నది. ప్రస్తుతం ఎఫ్‌సీఐకి ధాన్యాన్ని అత్యధికంగా సరఫరా చేస్తున్న రెండో రాష్ట్రం తెలంగాణే కావడం విశేషం.

26.96 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిరంతర ఉచిత విద్యుత్తు సరఫరా చేసింది. చారిత్రాత్మకంగా తెలంగాణలో చెరువులు ప్రధాన నీటిపారుదల వనరుగా ఉన్నాయి. మిషన్ కాకతీయ కింద 27,713 చెరువులను పునరుద్ధరించారు. నీటి పారుదల రంగంలో జోక్యాల ఫలితంగా భూగర్భజల మట్టాలు కూడా గణనీయంగా పెరిగాయి. సంక్షేమం విషయానికొస్తే పింఛన్లు (ఆసరా పింఛన్లు అని పేరు పెట్టారు) 44.54 లక్షల మంది లబ్ధిదారులను కవర్ చేస్తుంది. మిషన్ భగీరథ కార్యక్రమం రాష్ట్రంలో ఇంటింటికీ మంచినీటి సరఫరాను దాదాపు విశ్వవ్యాప్తం చేసింది. మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాన్ని ఉపయోగించే కుటుంబాల నిష్పత్తి 2015-16 లో 53 శాతం నుంచి 2019-20 లో 77 శాతానికి పెరిగింది.

అదే సమయంలో పెరుగుతున్న విద్యా ప్రమాణాలు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్), 2017–23 (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ 2023) ప్రకారం తెలంగాణలో యువత నిరుద్యోగ రేటు ప్రస్తుతం 15 శాతంగా ఉంది. వివిధ పోటీ పరీక్షల కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో 22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారంటే అర్హులైన యువతలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ ప్రభుత్వ రం గంలో 2 లక్షల ఖాళీలు మాత్రమే ఉన్నాయని గణాంకాలు చెప్తున్నాయి. దీనికితోడు పౌష్టికాహార సంబంధిత సూచీల విషయంలోనూ తెలంగాణ వెనుకబడి ఉన్నది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) డేటా ప్రకారం, మునుపటి రౌండ్ సర్వే (2015–16) నుంచి పిల్లల్లో (ఐదేండ్ల లోపు) ఎదుగుదల, వృథా స్థాయిలు తగ్గలేదు; వాస్తవానికి, అవి మరింత దిగజారాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల ద్వారా లబ్ధిపొందిన అర్హులైన కుటుంబాల నిష్పత్తి చాలా తక్కువగా ఉంది, ఇది చాలా అధిక స్థాయిలో తీర్చబడని డిమాండ్‌కు దారితీసింది.

> బీఆర్‌ఎస్ పాలనలో 67 శాతం మంది సంతృప్తిగా ఉన్నట్టు 2023లో లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ జరిపిన సర్వేలో తేలింది. సంతృప్తి చెందిన ఓటర్లలో గణనీయమైన భాగం కాంగ్రెస్ బీజేపీలకు ఓట్లు వేసింది. ఇది ప్రభుత్వంలో మార్పు కోసం బలమైన సెంటిమెంట్‌ను సూచిస్తుంది. 25 ఏండ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సున్న యువతలో అత్యధికులు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు. ఈ వర్గం నుంచి 5 శాతం ఓట్లు మాత్రమే బీఆర్‌ఎస్‌కు పడ్డాయి. దీనికితోడు సగానికి పైగా (46 శాతం) ఓటర్లు రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి పెరిగిందని భావించిన వారిలో దాదాపు సగం మంది (46 శాతం) కాంగ్రెస్‌కు ఓటేశారు.

2018 ఎన్నికల్లో రాష్ట్ర అసెంబ్లీలోని 119 స్థానాలకు గాను 88 స్థానాలను గెలుచుకొని భారీ మెజారిటీతో కేసీఆర్ ప్రభుత్వం తిరిగి ఎన్నికైంది. ఇది అధికార బీఆర్‌ఎస్ పట్ల అప్పట్లో ఉన్న సానుకూలతను సూచిస్తున్నది. కొత్త రాష్ట్రం కాబట్టి అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను బీఆర్‌ఎస్‌కే మరోసారి ప్రజలు అప్పగించారని తెలుస్తున్నది. దీనికి భిన్నంగా 2023 ఎన్నికలు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, రాష్ట్ర అవతరణ అనంతర పరిణామాలు మసకబారడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరును నిశితంగా, విమర్శనాత్మకంగా అంచనా వేయడాన్ని సూచిస్తున్నాయి. కొన్నేళ్లుగా మౌలిక వసతులు, సాగునీరు, ఆహారోత్పత్తి, విద్యుత్తు, నీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ గణనీయమైన పురోగతి సాధించింది. ఉన్నత శ్రేణి అవసరాలకు ప్రజలు ఇచ్చే ప్రాధాన్యం దీనికి తార్కిక పరిణామం.

పేదల కోసం పూర్తి ప్రభుత్వ సబ్సిడీతో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పతిష్ఠాత్మకంగా శ్రీకారం చుట్టింది. జనావాసాలు, పట్టణ కేంద్రాలకు దూరంగా గృహ సముదాయాలు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ల నిర్మాణం ద్వారా ఇది సాధ్యమైంది. లక్షల మంది దరఖాస్తుదారులు ఏండ్ల తరబడి కేటాయింపుల కోసం ఎదురుచూస్తుండటంతో 2 బీహెచ్‌కే ఇళ్లకు డిమాండ్ అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు ఈ పథకం చాలా మంది పేద కుటుంబాలకు అంతగా రుచించకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయంతో ప్రస్తుత స్థలంలోనే మెరుగైన ఇంటిని నిర్మించుకునేందుకు మొగ్గు చూపారు. లక్ష లబ్ధిదారుల్లో ఒక వర్గం ఇళ్ల నిర్మాణానికి తమ వంతు సహకారం అందించేందుకు కూడా సుముఖత వ్యక్తం చేశారు. అంతేకాకుండా 2 బీహెచ్‌కే పథకం అమలుకు కూడా ఇళ్ల కేటాయింపులో బీఆర్‌ఎస్ మద్దతుదారులపై పక్షపాతం చూపుతున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. పనులు పూర్తికావడం, కేటాయింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 2,92,938 ఇండ్లను కేటాయించాల్సి ఉండగా, 96,570 డబుల్ బెడ్రూం ఇండ్లనే పంపిణీ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా గృహలక్ష్మి పేరిట మరో పథకాన్ని బీఆర్‌ఎస్ సర్కార్ తీసుకొచ్చింది. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారుడు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల గ్రాంటును బదిలీ చేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం 3 వేల ఇళ్లను నిర్మించడం ద్వారా మొదటి దశలో 4 లక్షల మంది లబ్ధిదారులను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించింది. కానీ అమలుకు ముందే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పథకాన్ని కొనసాగించలేకపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ముందంజలో ఉన్న యువత ప్రభుత్వ రంగంలో ఎక్కువ ఉద్యోగావకాశాలు ఆశించారు. టీఎస్‌పీఎస్సీ చేపట్టిన తాజా నియామక ప్రక్రియలో ప్రశ్నాపత్రం లీకేజీలు, ఇతర అవకతవకలు చోటుచేసుకోవడం, ఫలితంగా పరీక్షలు రద్దు కావడం యువతను నిరుత్సాహపరచడమే కాకుండా వ్యవస్థపై విశ్వాసం కోల్పోయేలా చేశాయి. గ్రామీణ తెలంగాణకు చెందిన విద్యావంతులైన యువతలో చాలామందికి హైదరాబాద్‌లో సృష్టించే ప్రైవేట్‌రంగ ఉద్యోగాలను పొందడానికి అవసరమైన అర్హతలు లేదా నైపుణ్యాలు లేవు. 2014-15 నుంచి 2021-22 మధ్య ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో ఉద్యోగాలు 3.7 లక్షల నుంచి 7.7 లక్షలకు పెరిగాయి.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన 2వ పదవీకాలంలో షెడ్యూల్ కులాలు (ఎస్సీలు), ఇతర వెనుకబడిన తరగతులలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి రెండు లక్ష్య పథకాలను ప్రారంభించింది. అవి దళితబంధు పథకం, బీసీ బంధు పథకం; అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి మొదటి దాని కింద రూ.10 లక్షలు, రెండో దాని కింద రూ.1 లక్ష చొప్పున వ్యాపార వెంచర్లు ప్రారంభించేందుకు గ్రాంటుగా అందాయి. ఎన్నికల ఏడాది బడ్జెట్ (2023-24)లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధుకు రూ.17,700 కోట్లు కేటాయించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున 1,30,000 మంది లబ్ధిదారులకు ఈ పథకం ఉపయోగపడుతుందని భావించారు. ఈ పథకానికి విపరీతమైన డిమాండ్ ఉన్నందున క్షేత్రస్థాయిలో ఈ పథకం వ్యాప్తి చాలా తక్కువగా ఉందని స్పష్టమవుతున్నది.

ఓబీసీలకు దళితబంధు లాంటి పథకం డిమాండ్లకు ప్రతిస్పందనగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 ఎన్నికల సంవత్సరంలో బీసీ బంధును ప్రారంభించింది. కానీ, అంచనాలకు భిన్నంగా అధికార పార్టీ రెండు అంశాల్లో లబ్ధి పొందని కుటుంబాల నుంచి.. ముఖ్యంగా దళితబంధు కింద తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. అర్హులైన కుటుంబాల సంఖ్యతో పోలిస్తే మంజూరైన లబ్ధిదారుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. లబ్ధిదారుల ఎంపికను ఆయా ఎమ్మెల్యేలు ఖరారు చేయడంతో విచక్షణారహితంగా వనరుల బదలాయింపు జరిగింది. దీంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని చాలా గ్రామాలను పథకాల నుంచి మినహాయించారు. ఉదాహరణకు ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు బహుళ యూనిట్లు (కొన్ని సందర్భాల్లో 20 వరకు) రాగా, ఇతర గ్రామాల అర్హులైన లబ్ధిదారులకు తమను ఎందుకు మినహాయించారో తెలియదు.

సన్నకారు రైతులు, భూమి లేనివారిలో తీవ్ర అసంతృప్తిని కలిగించిన మరో పథకం రైతుబంధు పథకం. రైతుబంధు కింద ప్రతి రైతుకు ఏడాదికి ఎకరానికి ఏటా రూ.10 వేలు పెట్టుబడి సాయం రూపంలో రైతుకు అందిస్తారు. రైతుబంధు అన్యాయమైనది, సంపన్నులకు అనుకూలమైనదిగా భావించబడింది. ఎందుకంటే ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత కౌలుదారులుగా మారిన గణనీయమైన వర్గం, వాస్తవ సాగుదారులైన చిన్న హోల్డర్ల కంటే పెద్ద కమతాలు ఉన్న రైతులు చాలా ఎక్కువ మొత్తాలను పొందుతారు. అంతేకాక, భూమిలేని కుటుంబాలు, డిఫాల్ట్‌గా, ఈ పథకం ద్వారా మినహాయించబడతాయి; ఉదాహరణకు, రాష్ట్రంలో ఎస్సీ కుటుంబాలలో భూమి లేని వారు దాదాపు సగం మంది ఉన్నారు. కౌలు రైతులు ఈ పథకం కింద ప్రయోజనం పొందడానికి అనర్హులు. అధికారిక పట్టాలు లేని కారణంగా మినహాయించబడిన మరొక వర్గంలో ఎక్కువగా ఎస్సీ, షెడ్యూల్ తెగలకు చెందినవారున్నారు. అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వకపోవడం తదితర అంశాలను ప్రజలతో సంప్రదింపులు జరపడం ద్వారా అమలుచేయకపోవడంలో లోపాలు బయటపడుతున్నాయి.

2023 తెలంగాణ అసెంబ్లీ ఫలితాలు.. దేశంలోని కొత్త రాష్ట్రమైన తెలంగాణ పయనించిన అభివృద్ధి పథంపై కొత్త సవాళ్లను తెరపైకి తీసుకువచ్చాయి. అధిక, స్థిరమైన వృద్ధి రేటు, పెరిగిన తలసరి ఆదాయంతో స్థూల జాతీయ నమూనాకు అనుగుణంగానే తెలంగాణ అభివృద్ధి ఉన్నది. కానీ, ఈ ఆర్థిక పురోగతి సమానత్వ, సమ్మిళిత అభివృద్ధిగా పరిణమించలేదు. మానవ వనరుల పెట్టుబడికి, ఉపాధి కల్పనకు దారితీయలేదు.

> తెలంగాణలో అభివృద్ధి కనిపించింది. కానీ, ఎక్కడంటే.. ప్రజల మౌలిక సదుపాయాలలో, ప్రాథమిక గృహ అవసరాల వృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపించింది. మెరుగైన గృహాలు, మంచి ఉపాధి, విద్య, ఆంగ్ల మాధ్యమం, సంక్షేమం, సామాజిక భద్రత తదితర రంగాల్లో మార్పులు కనిపించాయి. బీఆర్‌ఎస్ సర్కార్ అద్భుతమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రాజకీయ జోక్యం కారణంగా కొంతవరకు అసమాన పంపిణీకి దారితీసింది. సంక్షేమ పథకాల అమలును మరింత సమ్మిళితం చేయడానికి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ ఉన్నప్పటికీ, దిద్దుబాట్లు చేయడానికి రాజకీయ సంకల్పం లేకుండా పోయింది.

విద్యావంతులైన యువత, చిన్న హోల్డర్లు, సాధారణంగా పేదలు వంటి జనాభాలో పెరుగుతున్న వ్యతిరేకత బలమైన భావాన్ని సూచించే విస్తృత సందేశాన్ని 2023 ఎన్నికల తీర్పు ప్రతిబింబిస్తుంది. సంక్షేమ అమలుతో ఎన్నికల్లో లాభాలు వస్తాయని, ప్రజలకు సుపరిపాలన ముఖ్యం కాదనే తప్పుడు భావన కూడా బీఆర్‌ఎస్ పార్టీ పతనానికి దోహదం చేసింది. ప్రజల ప్రయోజనాలు, ప్రాధాన్యాలతో అభివృద్ధి కార్యక్రమాలను అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని కూడా ఎన్నికల తీర్పు ఎత్తిచూపింది.

హైదరాబాద్ ప్రాంతంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేని మద్దతు లభించింది. కొన్నేళ్లుగా హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతూ ఉద్యోగ, వ్యాపార అవకాశాల కల్పనకు దారితీసింది. స్థిరమైన ప్రభుత్వ, వ్యాపార అనుకూల విధానాలు పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాయి. దీంతో రాజధాని, చుట్టుపక్కల గ్రామీణ తెలంగాణ మధ్య అభివృద్ధి అసమానతలు ఏర్పడి రాజధానిలోనే అవకాశాలు కేంద్రీకృతమయ్యాయి. పెరుగుతున్న అంచనాల నేపథ్యంలో 2023 తెలంగాణ తీర్పు వెలువరించిన విస్తృత సందేశం ఏమంటే.. సంక్షేమంతో పాటు వ్యతిరేకతను పరిష్కరించే సుపరిపాలన ద్వారా సమ్మిళిత అభివృద్ధి అనివార్యం.